తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## చిన్నారి హంతకులను వదలిపెట్టం

పుంగనూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త



చిన్నారి ఆసియా మృతికి కారణమైన హంతకులను వదలిపెట్టం అని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్‌రొకియా బేగం అన్నారు. గురువారం ఉదయం ఆమె పుంగనూరు పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గత 5 రోజుల క్రితం కిడ్నాప్‌కు గురై అనంతరం దుండగుల చేతిలో మరణానికి కారణమైన బాలికకు సంబంధించి కేసు విషయమై ఆమె ఆరాతీశారు. ఆమె బాలిక మృతిచెంది శవమై తేలిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసు అధికారులు కేసును వేగవంతంగా దర్యాప్తు జరుపుతున్నారని చెప్పారు.

## శ్రీచెంగాళమ్మ శరన్నవరాత్రులు ప్రారంభం

సూళ్లూరుపేట, అక్టోబర్ 3 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవిదేవస్థానంలో అమ్మవారి శరన్నవ రాత్రులు గురువారం నుంచిప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మీ నేతృత్వంలో ఈ వేడుకలను ప్రారంభించారు. అమ్మణ్ణి సన్నిధిలో అఖండ దీపం వెలిగించి శరన్నవ రాత్రులకు శ్రీకారంచుట్టారు. దేవస్థానం సమీపంలోని కాళంగినది నుంచి పవిత్ర జలాలను తీసుకొచ్చి కలశ స్థాపన చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా శరన్నవ రాత్రులను ప్రారంభించారు. ఈ యాగానికి పి.నాగేశ్వరరావు, రాధా దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మణ్ణి భక్తులకు శ్రీ పరమేశ్వరి అలంకారంతో దర్శనమిచ్చింది. కలశ స్థాపనకు బీరక రాంబాబు, శాంతి దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు.

# కందిపప్పు టోకరా!

### 300 టన్నులు అవసరమైతే 60 టన్నులు సరఫరా
### - ఈ నెల అరకొరా పంపిణీనే



చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త: నిత్యవసర సరుకులు తీసుకోవడానికి బిఎంయు వాహనాల వద్దకు వెళ్తున్న రేషన్‌కార్డుదారులకు చుక్కలు కన్పిస్తున్నాయి. అక్టోబర్ నెలలో ఉచిత బియ్యంతో పాటు అర్ధ కేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు సబ్సిడీ ధరలకు రేషన్‌కార్డుదారులకు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పింది. అక్టోబర్ నెలకు సంబంధించి ప్రస్తుతం బిఎంయు వాహనాలు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకుల్లో కేవలం ఉచిత బియ్యంతో పాటు అర్ధకేజీ చక్కెర ప్యాకెట్ మాత్రమే ఇస్తున్నారు. కొంతమంది బిఎంయు ఆపరేటర్లు మాత్రం కందిపప్పు ఒక కేజీ ప్యాకెట్‌ను సబ్సిడీ ధరలకు రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేస్తుండగా అత్యధిక బిఎంయు ఆపరేటర్లు ఉచిత బియ్యంతో పాటు అర్ధకేజీ చక్కెర ప్యాకెట్‌ను మాత్రం పంపిణీ చేస్తుండటంతో కార్డుదారులు తమకెందుకు కందిపప్పు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. గతంలో అధికారంలో వున్న వైకాపా ప్రభుత్వం చౌకదుకాణాలను తీసివేసి వాటి స్థానంలో బిఎంయు ఆపరేటర్లను ఏర్పాటు చేసి నిత్యవసర వస్తువులను ఇళ్ళ వద్దకే పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ఇళ్ళ వద్దకు వచ్చే బిఎంయు వాహనాలు బియ్యం ఉచితంగా ఇవ్వడంతో పాటు సబ్సిడీ ధరకు అర్ధకేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు పంపిణీ చేసేవారు. ఆ రోజుల్లో ఒక నెల సబ్సిడీ ధరకు కందిపప్పు సరఫరా చేస్తే ఒకొక్క నెలలో సబ్సిడీ ధరకు కందిపప్పును కార్డుదారులకు పంపిణీ చేసేవారు కాదు. ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం రేషన్‌షాపుల్లో అన్ని రకాల వస్తువులను సబ్సిడీ ధరలకు అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల కాలం పూర్తయ్యింది. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి రెండు రోజుల క్రితం అక్టోబర్ నెలకు సంబంధించి ఉచిత బియ్యంతో పాటు సబ్సిడీ ధరలకు అర్ధకేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 1 నుండి రేషన్ బిఎంయులు నిత్యవసర వస్తువుల పంపిణీలో బాగంగా ఉచిత బియ్యంతో పాటు సబ్సిడీ ధరలకు అర్ధకేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు కార్డుదారులకు ఇవ్వాల్సివుంది. జిల్లా వ్యాప్తంగా 1,379 రేషన్‌షాపులు వున్నాయి. వీటి పరిధిలో సుమారు 2.5 లక్షల మేరకు రేషన్‌కార్డులు వున్నాయి. ఈ కార్డుదారులకు ప్రతి నెలా 1వ తేదీ నుండి బిఎంయు అపరేటర్లు నిత్యవసర వస్తువులను ఇళ్ళ వద్దకు తీసుకెళ్ళి పంపిణీ చేస్తుంటారు. అక్టోబర్ నెలలో ఉచిత బియ్యంతో పాటు సబ్సిడీ ధరకు అర్ధకేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు లభిస్తుందని కార్డుదారులు ఆశ పడ్డారు. అయితే యధావిధిగా ఈ నెలలో సైతం ఉచిత బియ్యంతో పాటు అర్ధకేజీ చక్కెర సబ్సిడీ ధరకు ఇచ్చి ఈ నెల ఇంతే అంటూ బిఎంయు ఆపరేటర్లు కార్డుదారులకు స్పష్టం చేయడం గమనార్హం.

**ప్రతి ఒక్క కార్డుదారుడికి కందిపప్పు: సివిల్ సప్లై డిఎం మోహన్‌బాబు**

అక్టోబర్ నెలకు సంబంధించి ప్రతి ఒక్క రేషన్‌కార్డుదారుడికి ఒక కేజీ కందిపప్పు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. చిత్తూరు జిల్లాకు 300 టన్నుల కందిపప్పు రావాల్సివుండగా ప్రస్తుతం 60 టన్నుల కందిపప్పు మాత్రమే వచ్చిందని సివిల్ సప్లైస్ డిఎం మోహన్‌బాబు 'ప్రభాతవార్త'తో అన్నారు. జిల్లాకు శుక్రవారం నాటికి మరో 90 టన్నల కందిపప్పు రానున్నదని వచ్చిన కందిపప్పును వచ్చినట్లుగా రేషన్‌షాపు డీలర్ల వద్దకు పంపుతున్నామన్నారు. ఒకటి రెండు రోజుల్లో కందిపప్పు రేషన్‌సాపులకు పూర్తి స్థాయిలో అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెలలో ప్రతి రేషన్‌కార్డుదారుడికి ఒక కేజీ కంది పప్పు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# శాస్త్రోక్తంగా అంకురార్పణ

### విశ్వక్సేనుడి పర్యవేక్షణ - -నేటి సాయంత్రం ధ్వజారోహణం,
### తొలిగా పెద్దశేషవాహనసేవ- శ్రీవారికి సిఎం పట్టువస్త్రాలు






తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. గురువారం రాత్రి 7గంటల నుంచి 9వరకు వసంతమండపంలో ఈ ఘట్టం జరిగింది. తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శుక్రవారం (నేటి)సాయంత్రం జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. 5.45గంటల నుంచి 6గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజస్తంభంపైకి గరుడపటాన్ని అధిరోహిస్తారు. ఆ తరువాత రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## సామాన్యభక్తులకే ప్రాధాన్యత !

**-అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు,విఐపి బ్రేక్ రద్దు**

**-8న గరుడసేవ సాయంత్రం 6.30గంటలకే**

**-టిటిడి ఈఓ ,అదనపు ఈఓ శ్యామలరావు, వెంకయ్యచౌదరి**



తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠవాసుడు శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే 4వతేదీ నుండి 12వరకు తొమ్మిదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలతోబాటు ఆర్జితసేవలు కూడా రద్దుచేశామన్నారు. భక్తుల సౌలభ్యం కోసం ఉదయం వాహన సేవలను 8గంటలకే ప్రారంభించి 10గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగిస్తామన్నారు. రాత్రి వాహనసేవలు 7గంటలకే మొదలవుతాయని తెలిపారు. 8వతేదీ గరుడసేవ సాయంత్రం 6.30గంటలకే ప్రారంభిస్తామన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ, భద్రత ,వాహనాల పార్కింగ్, భక్తులకు దర్శనం తదితర అంశాలపై టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలిసి అన్నమయ్యభవనంలో గురువారం మధ్యాహ్నం మీడియాకు వెల్లడించారు. భగవంతుని వాహనసేవలు ఉద యం, రాత్రి రెండు పూజలా జరుగుతాయని, పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం వుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో పూర్తిగా సర్వ దర్శనం మాత్రమే ఉంటుందని తెలిపారు. భక్తుల రద్దీకి తగ్గట్లు 7లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచామన్నారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో ,టిటివి విజిలెన్స్‌తో సమన్వయంతో ఏర్పాట్లుచేపడతామన్నారు. భక్తులకు 65లడ్డూ కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో అశేషసంఖ్యలో విచ్చేసే భక్తులకు సేవలందించేందుకు శ్రీవారి సేవకులు ,5వేలమంది పోలీసులు ,పారిశుధ్యసిబ్బంది అదనంగా ఏర్పాటుచేసుకున్నామన్నారు. భక్తుల రవాణాకు అవసరమైన ఆర్టీసి బస్సులు నడిపేలా ఆదేశించామన్నారు. తిరుమలలో 28 ఎల్ఈడి పెద్దస్క్రీన్లు ఏర్పాటుచేశామన్నారు. అన్నప్రసాదభవనంలో ఉదయం 7గంటల నుండి అర్ధరాత్రి 1గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తామన్నారు. 3లక్షల మజ్జిగప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు. వాహనాలపై చిల్లరనాణేలు విసరొద్దని విజ్ఞప్తి చేశారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

### -అమ్మవారి ఆలయాల్లో ఆకట్టుకున్న అలంకరణలు -తొలిరోజు కలశస్థాపన అలంకరణలో జ్ఞానప్రసూనాంబదేవి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు జ్ఞానప్రసూనాంబ అమ్మవారు కలశస్థాపన అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వగా, దుర్గాంబ కొండపై వెలసిన కనకదుర్గాదేవికి విశేషఅభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. అమ్మవారి అలంకరణ భక్తుల్లో తన్మయత్వం నిండింది. మరోవైపు మహిళా భక్తులు ఆలయం ప్రాంగణంలో నిమ్మకాయల దీపాలు వెలిగించడం కనిపించింది. ఇక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ దృశ్యం, ఏడుగంగమ్మల అమ్మవారికి విశేష అలంకరణ, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గాదేవి అమ్మవారికి స్వర్ణకవచాలంకృత అలంకరణ దృశ్యం, అమ్మవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో వెలసిన అమ్మవారు శ్రీశైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కాగాజ్ఞానప్రసూనాంబ అమ్మవారిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి కలవస్థాపన అలంకరణలో తీర్చిదిద్దారు. ఇక పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలోను, బిపిఅగ్రహారం లోని పెద్దగంగమ్మ దేవాలయంలో వెండి కవచాలంకరణలో దర్శనం, బహదూర్ రుపేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బాలవాసవీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం, భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అలంకరణలో బాల త్రిపుర సుందరీ అలంకరణ అమ్మవారు దర్శనం ఇచ్చారు.

## తల్లి మరణం తట్టుకోలేక తనయుడు మృతి

చంద్రగిరి అక్టోబర్ 3 ప్రభాతవార్త : తల్లి మరణంతో తల్లడిల్లిన తనయుడు మృతి చెందిన విచారక దుర్ఘటన గురువారం రాత్రి రాయలపురంలో చోటుచేసుకుంది. రాయలపురంకు చెందిన ఎన్.మునెమ్మ (60) అనారోగ్యంతో మరణించింది. తల్లి మరణ వార్త విన్న తనయుడు రమేష్ (45) తట్టుకోలేక తల్లి భౌతికకాయం పక్కనే కుప్పకూలి తుదిశ్వాస విడిచాడు. రమేష్‌కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. తల్లీ, బిడ్డ ఏకకాలంలో మృతి చెందడంతో రాయలపురంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

### - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



రామకుప్పం, అక్టోబర్ 3 ప్రభాతవార్త

గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ననియాల, పిఎంకె తాండా గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం ఆధారంగా బ్రతుకుతున్న గిరిజనులు సాగు చేస్తున్న పంటలపై ఏనుగులు దాడులు చేసి పంటలు నష్టపరుస్తున్న విషయంగా సమగ్ర నివేదిక రూపొందించామన్నారు. ఏనుగుల దాడుల నిరోధానికి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇక ననియాల ఎకో టూరిజాన్ని సైతం అభివృద్ధి చేస్తామని తద్వారా స్థానికులకు కొంత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ విషయంగా సైతం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సమావేశంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, తహశీల్దార్ బాబు, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, రామూర్తి, హరీష్, రఫీ, కృష్ణనాయక్, కామరాజనాయక్, గంట్లప్పగౌడు, ఎపిఓ రవికుమార్, ఎపిఎం శ్రీనివాసమూర్తి, ప్రజలు పాల్గొన్నారు.

## మూనాళ్ళ ముచ్చటగా లద్దిగం ఆసుపత్రి

**-భవనం కొరతతో చౌడేపల్లికి చేరుకొన్న స్టాఫ్**

**-విచారణ చేపట్టిన డిఐఓ హనుమంతరావు**



చౌడేపల్లి, అక్టోబర్ 3 ప్రభాతవార్త

లద్దిగం ఆసుపత్రి నిర్వహణ మూనాళ్ళ ముచ్చటగా తయారైంది. ఆరోగ్యకేంద్రం నిర్వహణా భారం పెరగడంతో అక్కడున్న అధికార, సిబ్బంది చౌడేపల్లి పిహెచ్‌సికి వచ్చారు. దీంతో సర్పంచు కృష్ణారెడ్డి గ్రామంలోని డిజిటల్ లైబ్రరీ భవనాన్ని ఆసుపత్రికి వినియోగించుకోవాలని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు గురువారం లద్దిగంలో పర్యటించారు. భవనంతోపాటు ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ పవన్ కుమార్‌పై వ్యక్తిగత ఆరోపణలు వచ్చాయనీ విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 50వరకు డెంగీ కేసులున్నాయనీ, పారిశుద్ధ్యంపట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. కాగా జూన్ 2023 8న లద్దిగం పిహెచ్‌సిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అయితే భవనం కొరత వుండటంతో అద్దె భవనంలో ఆసుపత్రి వుంది. ప్రభుత్వం నుంచి సంబంధిత నిధులు మంజూరు కావడం లేదనీ, నిర్వహణా భారం పెరగడంతో ప్రస్తుతానికి చౌడేపల్లి నుంచి కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

### - జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి

చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై అందే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆర్డీఓలు, తహసిల్దార్లను ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ రైట్స్‌లకు సంబంధించిన రెవెన్యూ అంశాలపై అర్డీఓలు, తహసిల్దార్లతో సమీక్షించారు. ఈ సమీక్షలో జెసి జి.విద్యాధరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజల అర్జీల పరిష్కారం నిమిత్తం రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్ళకుండా చర్యలు చేపట్టాలన్నారు.

## ఆసుపత్రి నిండా సమస్యలు, రోగాలు

# ఆరోగ్యానికి 45రోజుల్లో చర్యలు

### నిరుపేదలకు కార్పొరేట్ సదుపాయాల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ప్రజలకు సకల సదుపాయాలతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించుటకు 1999లో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వంద పడకల ఏరియా ఆసుపత్రిని నిర్మిస్తే గత ఐదేళ్ళలో ఈ ఆసుపత్రిని గురించి పట్టించుకోక పోవటంతో సమస్యల అనారోగ్యం చోటు చేసుకుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేసారు. సుమారు గంటకు పైగా వార్డుల్లో రోగులను విచారించారు. అలాగే వార్డులతో పాటు విభాగాలను పరిశీలించారు.ఇక్కడ సమస్యలన్ని రాబోవు 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.ఆసుపత్రిలో ప్రసూతి వార్డులో బెడ్‌లు అధ్వాన్నంగా మారాయన్నారు. ఇక్కడ 70 బెడ్‌లు కొత్తవి కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి కోరారన్నారు. ఇక్కడ మంచినీటి సమస్య ఉందని ఆయన వివరించారు. గతంలో తన తండ్రి పరిపాలనలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ చెడిపోయిందని దానిస్థానంలో కొత్త ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని వివరించారు. అక్సిజెన్ యూనిట్ గదిని అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. 45రోజుల్లో ఆసుపత్రి రూపు రేఖలు మార్చేస్తామన్నారు.ఈ ఆకస్మిక తనిఖీలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు,నింద్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం

### -పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాకం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:





కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో గత నెల 7 నుండి 27 వరకు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతోనే దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగించుకున్న సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈకార్యక్రమంకు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ ఉభయదారులు, స్థానికులు, గ్రామస్థులు, భక్తుల సహకారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో చ్చిన ఉద్యోగి నుండి అధికారుల వరకు ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రస్తుతం సరాసరి 25 వేల వరకు వుండగా రానున్న రోజుల్లో 50 వేల వరకు చేరుతుందని తెలిపారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఆలయ అధికారులు అందించిన సహకారంతో ఉత్సవాల్లో ఏచిన్న అవాంచనీయ సంఘటన జరుగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ఉత్సవ ఉభయదారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, జడ్పీటీసీ సుచిత్ర, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కందిపప్పుకు ఎగనామం!

**పాలసముద్రం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** అధికారంలోకి వస్తే రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు అన్ని వస్తువులు ఇస్తామని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నాలుగు నెలలు అవుతున్నా రేషన్‌షాపుల్లో కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించలేదు. పాలసముద్రం మండలంలో ప్రభుత్వం ఈ నెల బియ్యంతో పాటు అర్ధ కేజీ చక్కెర, ఒక కేజీ బియ్యం సరఫరా చేస్తుందని పేర్కొనడంతో రేషన్‌కార్డుదారులు వీటిని కొనుగోలు చేయడానికి వెళ్ళిన వారికి చుక్కెదురైంది. బియ్యంతో పాటు అర్ధ కేజీ చక్కెర మాత్రమే కార్డుదారులకు చౌకదుకాణదారులు అందించడంతో కార్డుదారులు నోర్లుబాదుకున్నారు. అధికారులు బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు ఇస్తామని చెప్పినా చౌకదుకాణదారులు బియ్యం, చక్కెర మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కందిపప్పును కొన్ని గ్రామాలకు మాత్రమే కేటాయించారని కొని గ్రామాలకు కేటాయించలేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసిల్దారు అరుణకుమారిని వివరణ కోరగా మండల పరిధిలో కొంతమంది రేషన్ డీలర్లకు కందిపప్పు వచ్చిందని అది సైతం పూర్తి స్థాయిలో రాలేదన్నారు. ఈ విషయంను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందని తెలిపారు.

## రూ.8 వేల విలువైన నాటుసారా సీజ్

**చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం 8 వేల రూపాయల విలువైన నాటు సారాను పోలీసులు పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డిఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్యకు వచ్చిన సమాచారం మేరకు బండపల్లి రోడ్డు భరత్‌నగర్‌లో అక్రమంగా సారాయి విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య అక్కడికి సిబ్బందితో వెళ్ళి దాడి చేసి చిత్తూరు గాంధీనగర్ బండపల్లికి చెందిన విజయరాజ్(58), గుడిపాల మండలం శ్రీరంగంపల్లి గ్రామంకు చెందిన డి.అరుణ్(60),చిత్తూరు అశోక్‌పురంకు చెందిన ఎన్.హుస్సేన్ ఆలీ(40)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## బేటరాయస్వామి కొండకు పది ఆర్టీసీ బస్సులు

**కుప్పం, అక్టోబర్ 3 ప్రభాతవార్త** ఈనెల 5వతేది బేటరాయస్వామి కొండ వద్ద టిటిడిచే నిర్వహించే కళ్యాణోత్సవానికి భక్తుల సౌకర్యార్థం వివిధ మార్గాల్లో పది ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. కుప్పం నుంచి వెండుగంపల్లి మీదుగా, డికెపల్లి మీదుగా నాలుగు బస్సులు, గుడ్లనాయనపల్లి, బాబునగర్, మోట్లచేను, పైపాళ్యం, మల్లానూరు, కుప్పం నుంచి పది బస్సులు నడుపుతామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శరన్నవరాత్రుల ఉత్సవాలు విజయవంతం చేయాలి

– ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, అక్టోబర్ 3 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను అందరూ కలసి విజయవంతం చేయాలని ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. గురువారం స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారి దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లను ఆయన నేతలతో కలసి పరిశీలించారు. శక్తి స్వరూపిణి అయిన దుర్గామాత ఉత్సవాలను సమిష్టిగా పనిచేసి జయప్రదం చేయాలన్నారు. ఆలయానికి వచ్చే మహిళా భక్తులకు తగు ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. అనంతరం పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం,కాణిపాకం వెంకటేష్, ఆర్ముగ ం,మంజు, రవి, వేణుగోపాల్, యశ్వంత్, అప్పు, నరేష్, శారదమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్టేడియాన్ని శాప్ ద్వారా అభివృద్ధి చేయిస్తాం

కుప్పంరూరల్, అక్టోబర్ 3 ప్రభాతవార్త

కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయించి క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామని కుప్పం క్రీడల అభివృద్ధి సభ్యులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సమావేశంలో సీనియర్ క్రీడాకారులు మాట్లాడారు. కుప్పంలో ఎన్టీఆర్ స్టేడియం ఏర్పాటు, అభివృద్ధికి తమవంతు కృషి చేశామన్నారు. గత ఐదేళ్లలో స్టేడియం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వ హయాంలో స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఈనెల 5వతేది నియోజకవర్గ స్థాయి సమావేశం స్టేడియంలోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు తప్పక హాజరు కావాలని కోరారు. సమావేశంలో క్రీడల అభివృద్ధి సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు

**వి.కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త** వి.కోట పంచాయతీలో డంపింగ్ యార్డు ఏర్పాటుకోసం స్థలాన్ని గుర్తించి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం సర్పంచ్ పిఎన్ లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వి.కోట – కెజిఎఫ్ మార్గంలో మార్కెట్ సమీ పంలో వర్షపునీరు అధిక ంగా నిల్వ ఉంటోందని ఇరువైపులా డ్రైన్ల నిర్మాణంకు నిధులు మంజూరుచేస్తామని జడ్పీఛైర్మన్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే జడ్పీ నిధుల ద్వారా నూతన బోర్లు మంజూరు చేస్తామన్నారు. స్మశాన వాటికలు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా స్థలాలు అప్పగించాల న్నారు. ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు లేనివారు నిరి ్మంచుకోవాలని ప్రభుత్వం 12వేలు అందిస్తుందన్నారు. అనంతరంపలుఅంశాలపైచర్చించారు. సమావేశంలో వైస్ సర్పంచ్ అక్మల్, ఈఓ శివశంకర్, ఎంపిటిసిలు, వార్డుసభ్యులు, నేతలు పాల్గొన్నారు.

## మా భూమిని మాకు ఇప్పించండి

**రొంపిచెర్ల, అక్టోబరు 3 ప్రభాతవార్త** రొంపిచెర్ల మండలం మల్లె గ్రామ లెక్క గాజులపల్లె హరిజనవాడలో ఉన్నటువంటి భూమిని అదేగ్రామానికి చెందిన ఆగ్రవర్ణాల వారు ఆక్రమణకు ప్రయత్నం చేస్తున్నారని, ఆదిమ తాతలకాలం నుంచి తమదిఅని, దానిని మాకు ఇప్పించండి అని శ్రీనివాసులు అనే వ్యక్తి కోరుతున్నాడు. దీనిపై గురువారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నెంబరు 1146 లెటర్2లో ఉన్నటు వంటి 2ఎకరాల 35 సెంట్లుజాగాని దళితులకు దక్కకుండా అదేగ్రామస్తులు అడ్డపడుతున్నారని వాపోయారు.

## శైలపుత్రి అలంకారంతో శ్రీ ఆరిమాని గంగమ్మ

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** మండలంలోని ఆరిమాకులపల్లె గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగుంట గ్రామంకు చెందిన లాయర్ రమేష్‌రెడ్డి దంపతులు పుట్టుమట్టి తీసుకువచ్చిన అంకురార్పణతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మొదటిరోజు గురువారం శ్రీ శైలపుత్రి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి వెంకటాచలపతి, అప్పి ఆచార్యుల బృందం ఆలయ ఆవరణలో బాల గణపతి హోమం, కనకదుర్గ దేవి హోమం, మహా మంగళహారతి, అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మంగుంట గ్రామానికి చెందిన హిమాచలపతిరెడ్డి, పద్మావతమ్మ, అడ్వకేట్ రమేష్‌రెడ్డి, భార్గవి దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారికి మంగుంట గ్రామం నుండి సారె సమర్పించి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒడ్డిపల్లి గ్రామంకు చెందిన ఆలయ ఆర్చి దాత బోడపాటి ఆనందనాయుడు ఉభయదారులుగా వ్యవహరించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, జగన్నాధనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, త్యాగరాజనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, జలంధర్‌నాయుడు, సిద్ధయ్యశెట్టి, కర్ణం జయచంద్రనాయుడు, యర్రమునిరెడ్డి, హేమాద్రియాదవ్, ఆలయ ఇఓ తిమ్మారెడి, తయ్యూరు పాయకట్టు 18 గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## దోమల కట్టడికి స్ప్రేయింగ్

యాదమరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



దోమలను కట్టడి చేయడానికి యాదమరి మండలం ఆరిమాకుపల్లె గ్రామంలోని ఇళ్ళల్లో గురువారం యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరిమాకుపల్లె గ్రామంలో గత ఏడాది ఈ సమయంలో మలేరియా పాజిటివ్ నమోదు అయ్యిందని, ఆ మేరకు ఇక్కడ దోమల వ్యాప్తి చెందకుండా ప్రతినెల స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస గృహాల పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. గ్రామంలో ఎక్కడ మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. నిరుపయోగంగా వున్న వాటిని నివాస గృహాలకు దూరంగా పడవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరుసాహెబ్, యాదమరి పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరుకు పక్కాగా నీటి సరఫరా

– ఎన్టీఆర్ జలాశయంను తనిఖీ చేసిన కమీషనర్ నరసింహప్రసాద్



చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:

కలవగుంట ఎన్టీఆర్ జలాశయం నుండి చిత్తూరు నగరానికి ప్రస్తుతం జరుగుతున్న మంచినీటి సరఫరాను పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ గురువారం ఎన్టీఆర్ జలాశయంను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రస్తుతం ఎన్టీఆర్ జలాశయంలో నీరు ఎంత నిల్వ వుంది, రోజుకు జలాశయం నుండి ఎంత నీటిని వినియోగిస్తున్నారు, ఎన్టీఆర్ జలాశయం నుండి నీరు ఇంకా ఎన్ని రోజులు సరఫరా చేయవచ్చు అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమీషనర్ జలాశయం పంప్ హౌస్‌లోని మోటర్లను తనిఖీ చేశారు. మోటర్ల రన్నింగ్ టైం, తనిఖీ చేసిన కమీషనర్ మోటర్ల పంపుసెట్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. రిపేర్లు ఏదైనా వుంటే అప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం కమీషనర్ పునేపల్లి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేసి నీటి శుద్ధీకరణ తీరును క్లోరినేషన్ తీరును పరిశీలించారు.

## నారా లోకేష్‌ను కలిసిన సికె సాయికృష్ణారెడ్డి



**చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె బాబు తనయుడు సికె సాయికృష్ణారెడ్డి విజయవాడలోని ఆయన స్వగృహంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సికె బాబు తనయుడు సికె సాయికృష్ణారెడ్డి చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితులను వివరించినట్లు తెలిసింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వారాహి సభకు తరలిన జనసేన నాయకులు



**చౌడేపల్లి, అక్టోబర్ 3 ప్రభాతవార్త** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో తిరుపతిలో జరుగుతున్న వారాహి సభకు మండలం నుంచి జనసేన నాయకులు తరలి వెళ్ళారు. జనసేనాని గందోడి చరణ్ రాయల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలోని సనాతనధర్మ పరిరక్షకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. జనసేన నాయకులు శ్రీకాంత్, వినీత్, రామ్‌బాబు, రాజు, రాజేష్, చందు తదితరులు తిరుపతికి వెళ్ళిన వారిలో వున్నారు.

## మార్కెట్‌కు అనుగుణంగా పంటలు వేయాలి

చౌడేపల్లి, అక్టోబర్ 3 ప్రభాతవార్త

మార్కెట్‌కు అనుగుణంగా పంటలు వేయాలని వ్యవసాయాధికారిణి జ్యోతి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకొండామర్రి, చిన్నకొండామర్రి రైతు సేవా కేంద్రం పరిధిలోని వ్యవసాయ పొలాల వద్ద రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. పచ్చిరొట్ట, జీవామృతం వంటి వాటిపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచు పూల చంద్రమౌళి, విఎఎలు నవీన్, అర్షద్, మార్కెట్ కమిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## షిర్డీసాయిబాబా ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి, అక్టోబర్ 3 ప్రభాతవార్త** స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పృద్వీనవీన్‌చే స్వామివారికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## కామాక్షిదేవి అవతారంలో అన్నపూర్ణాదేవి

**పుంగనూరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త** దేవి నవరాత్రి ఉత్సవాలను పుంగనూరులోని పలు అమ్మవారి ఆలయాలలో గురువారం నుంచి ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. తొలిరోజు శ్రీకాశీవిశ్వేరస్వామి వారి ఆలయంలో శ్రీ అన్నపూర్ణాదేవికి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కంచి కామాక్షీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సుబ్బయ్య దీక్షితుల సారధ్యంలో శ్రీవారాహీ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వివాహిత అదృశ్యం

పుంగనూరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త

తన భార్య కనపడలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం జరిగింది. మండల పరిధిలోని అరవవాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ హరీష్ భార్య పూల మాధవి గత తొమ్మిది రోజులగా కనపడకుండా పోయిందని ఆయన పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన పి.వంశీధర్‌రెడ్డి అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చిట్టమూరులో జోరుగా పొలం పిలుస్తోంది

చిట్టమూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త



రాష్ట్రప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం చిటమూరు మండలంలో జోరుగా జరుగుతోంది. మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఈ కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరై వ్యవసాయానికి సంబంధించిన సూచనలు సలహాలు తీసుకుంటున్నారు. బుధవారం యల్లసిరి, అరవపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించగా, గురువారం తాడిమేడు, ఆరూరు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి డిఆర్‌సి నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం హాజరవుతారని తెలియజేశారు. అనంతరం రైతులకు తక్కువ ఖర్చుతో పని తక్కువ కాలంలో అయ్యేందుకు డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. డ్రోన్ ఆపరేటర్ వెంకటకృష్ణయ్య ఆధ్వర్యంలో అరవపాలెం గ్రామానికి చెందిన రైతు పెళ్లూరు కరుణాకర్‌రెడ్డి అర ఎకరం మామిడితోటలో డ్రోన్ ద్వారా చెట్లకు పట్టిన చీడపీడలను నివారించేందుకు పిచికారి నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్‌తో పాటు అరవపాలెం, ఆరూరు విఎఎలు సునంద, సర్ఫుద్దిన్, ప్రకృతి విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ రక్తదాతలకు పురస్కారాలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 3 ప్రభాతవార్త



జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిరంజీవి సేవాసంఘం అధ్యక్షుడు మాబాషాకు, మెగా బ్రదర్స్ సేవాసమితి వ్యవస్థాపకులు తీగల చంద్రశేఖర్‌రావుకు 2006వ సంవత్సరం నుంచి రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందించినందుకు ఈ పురస్కారాలు అందజేశారు. తిరుపతి జిల్లా చిరంజీవి యువత, జనసేన పార్టీ సంయుక్తంగా గత ఏడాది 911 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంక్‌కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్, ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి చేతులు మీదుగా ఈ పురస్కారాలను అందజేశారు.

## జెఎన్‌టియు సాఫ్ట్‌బాల్ జట్టుకు విద్యార్థులు ఎంపిక

కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎ.చందు (సెకండియర్), సిహెచ్ విష్ణువర్ధన్‌బాబు (థర్డ్ ఇయర్) క్రీడాకారులు అక్టోబర్ 2న శాంతిరామ ఫార్మశి కాలేజి నంద్యాలలో జరిగిన జెఎన్‌టియుఏ ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జెఎన్‌టియుఏ జట్టుకు ఎంపికైన వీరు డిసెంబర్ నెలలో జరగబోయే ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ క్రీడా పోటీలలో జెఎన్‌టియుఏ అనంతపురం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ క్రీడలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో విక్రమ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తారని కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి

**కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త** మహిళలు పోటీ ప్రపంచంలో వారి జీవన విధానాన్ని పెంపొందించుకొని సమాజంలో ఒకరిగా జీవించాలని కోట ఎపిఎం అనిల పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఐకెపి కార్యాలయంలో సంఘ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. వ్యక్తిగత రుణాలు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమల డైరీ ఫామ్స్, బేకరిలు, టింకరింగ్ తదితర పథకాలతో పాటు రాయితీలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలి

కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త

రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా వరి విత్తనశుద్ధి చేపట్టి నార్లు పోసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ పోషకాలైన జింక్, జిప్సం, బోరాన్ ఉపయోగాలను రైతులకు వివరించారు. రైతులందరూ తమ పొలంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వరి సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–పంట నమోదు చేసుకోవాలని కోరారు. కౌలు రైతులు విఆర్‌ఓల నుంచి కౌలుపత్రాలు పొందాలని కోరారు. పశుసంవర్ధకశాఖ అధికారులు మాట్లాడుతూ పాడి రైతులకు గోశాల పథకం ద్వారా షెడ్లు, గడ్డి, విత్తనాలు, పశువులకు కావలసిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యానశాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ యంత్రాలతో పవర్ స్ప్రేయర్లు, పవర్ పిల్లర్స్, డ్రిప్స్, స్ప్రింక్లర్లు పొందవచ్చని తెలియజేశారు.

## అధికారులు.. బదిలీలు

కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త

కోట మండల పరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు బదిలీ అయినట్లు తహశీల్దార్ జయజయరావు చెప్పారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్ ఓజిలి తహశీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారని తెలిపారు. ఇక్కడ డిటిగా పనిచేస్తున్న మల్లికార్జునరావు పౌరసరఫరాల శాఖ డిటిగా వెళ్లారని, ఇక్కడికి డిటిగా అజంతుల్లా ఖాన్‌ను నియమించారని పేర్కొన్నారు. మండల సర్వేయర్ రామ్‌కుమార్ నెల్లూరుకు బదిలీ కాగా, ఇక్కడికి ఓజిలి నుంచి గోపీరెడ్డిని నియమించారని తెలిపారు. ఆర్ఐ ప్రశాంతకుమార్ బదిలీ కాగా, చిట్టమూరు ఆర్ఐగా పనిచేస్తున్న మధులత కోటకు బదిలీపై వచ్చారని తెలిపారు.

## ఎన్‌బికెఆర్‌లో ప్రశాంతంగా టెట్ ప్రారంభం

కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయి. రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు తొలిరోజు 63 మంది అభ్యర్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ

కోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త

దేశీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అందుకు కోట మండలంలోని ప్రజలు ఆలయాల్లో శైవ సాంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గురువారం గూడలి గ్రామంలోని రామలింగ చాముండేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి అలంకరణ, కుంకుమార్చన, మహానివేదన అనంతరం భక్తులు దర్శనం ప్రారంభించారు. అమ్మవారు బాలత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల నుంచి నీరాజనాలు అందుకున్నారు. కోటలోని కోటమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి.

## గంజాయి స్వాధీనం - నిందితుడు అరెస్ట్

వెంకటగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త



గంజాయిని విక్రయించేందుకు తీసుకొని వెళ్తున్న షేక్ కైఫ్‌ను వెంకటగిరి రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేసి 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సిఐ ఏ. వెంకటరమణ తెలిపారు. వెంకటగిరిలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముద్దాయి షేక్ టైప్ ఒరిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి వెంకటగిరి రైల్వే స్టేషన్‌లో దిగాడని తెలిపారు. బస్సులో తిరుపతి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ముద్దాయి చెన్నైకి చెందిన వ్యక్తి అని తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘ పెట్టినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి దుర్గాప్రసాద్ గాట్ వద్ద

నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి దంపతులు

**వెంకటగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త** దివంగత మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాదరావు జయంతి సందర్భంగా ఆయన గాట్ వద్ద ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి దంపతులు నివాళులు అర్పించారు. బల్లి దుర్గాప్రసాదరావు మంత్రిగా ఎమ్మెల్యేగా అనేక సేవలందించారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తున్నట్లు చెప్పారు. బల్లి దుర్గ ప్రసాద్ రావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## బల్లి దుర్గాప్రసాదరావు సేవలు చిరస్మరణీయం

అధ్యాత్మిక వేత్త కోట సునీల్ కుమార్ స్వామి



**గూడూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** దివంగత మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద రావు సేవలు చిరస్మరణీయమని అద్యాత్మికవేత్త కోట సునీల్ కుమార్ స్వామి కొనియాడారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద దుర్గాప్రసాద్ రావు అభిమానులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కోట సునీల్ కుమార్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోట సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ్యునిగా, మంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఎంపిగా తన బాధ్యతలు నిర్వహించారన్నారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ప్రజలందరికీ అనునిత్యం అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరికి పనిచేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు వాకాటి ప్రభాకర్, చిల్లకూరు మండలం జడ్పిటిసి మన్నం శీనయ్య, మాజీ అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పేటేటి చంద్రనీల్, కట్టికల సురేష్, సంజీవిని నాయుడు, రమేష్, సుబ్బారావు, బల్లి బెనర్జీ, మధిరి సునీల్, చిన్న, సాయి, నాయకులు పెటేటి చంద్రనీల్, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లిపూడిలో పొలం పిలుస్తోంది

వాకాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త



వాకాడు నెల్లిపూడి యారగాటిపల్లి పంచాయితీ గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారిని దీపా ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడిలో తగు సలహాలు, సూచనలు రైతులకు అందజేశారు. వెటర్నరీ ఏడి వెంకటరమణ, టిడిపి నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గిద్దలూరి మనోజ్ కుమార్‌కి రెడ్ క్రాస్ అవార్డు

గూడూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త



గూడూరు పట్టణానికి చెందిన గిద్దలూరు మనోజ్ కుమార్‌కి రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. గిద్దలూరు రమణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అదే విధంగా 200 యూనిట్లు రక్తదానం చేపించడం ద్వారా బెస్ట్ మోటివేటర్ అవార్డును రెడ్ క్రాస్ నెల్లూరు చైర్మన్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు రమణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ మా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా రక్తదాన శిభిరాలు కూడా ఏర్పాటు చేశామని, అందుకు తను బెస్ట్ మోటివేటర్‌గా అవార్డు ఇచ్చిన రెడ్ క్రాస్ నెల్లూరు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చిన్న ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సమస్యల పరిష్కారంపై

కలువాయిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

గూడూరు డివిజన్ ఇఇ కెవి నరేంద్రరెడ్డి వెల్లడి



గూడూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త

గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు, కోట, గూడూరు రూరల్ సబ్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు గూడూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవి నరేంద్ర రెడ్డి తెలిపారు. గురువారం గూడూరు మున్సిపాలిటీలో గోగినేనిపురంలో ఉన్న డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు అక్టోబర్ 4వ తేది శుక్రవారం ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్, కరెంట్ ఆఫీస్ మెయిన్ రోడ్డు కలువాయి నందు కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అదాలత్‌లో సిజిఆర్‌ఎఫ్ ఛైర్ పర్సన్ వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు కె. రామ మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు జి. ఈశ్వరమ్మ, డిస్కం అధికారులు, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై రాత పూర్వక ఫిర్యాదు ద్వారా తెలియపరచి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఇఇ తెలిపారు.

## ప్రధాన రోడ్డును విస్తరణ చేయాలి...ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
### -పంచాయతీలో తీర్మానాల బుక్ ఏమైందో చెప్పాలని డిమాండ్
### -దుర్గసముద్రం గ్రామసభలో పలు ప్రజా సమస్యలపై చర్చ

**తిరుపతిరూరల్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో అనేక ప్రజా సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిని వెడల్పు చేసి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేయాలని, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేసారు. గురువారం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన 'గ్రామసభ' జరిగింది. ఈ సభలో సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో గత 23సంవత్సరాలు క్రితం ఏర్పాటు చేసిన త్రాగునీటి పైపులైన్ మరమ్మతుకు గురైందని, మరమ్మతులు చేపట్టినప్పటికి మరల మరల పైపులైన్ లీకేజీ అవుతుందని, నూతన పైపులైన్ ఏర్పాటు చేయటానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలో పాడైపోయిన వీధిదీపాలను మరమ్మతుతో పాటు, కొత్త దీపాలను కూడా ఏర్పాటు చేయిస్తున్నానని తెలిపారు. టిడిపి నాయకులు మునిశేఖర్ మాట్లాడుతూ దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో 69 అభివృద్ధి పనులను గుర్తించామని, కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో దశలవారీగా పూర్తి చేయటానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో ఇసుక అక్రమ రవాణా వల్ల రోడ్లని దెబ్బతింటున్నాయని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని వైకాపా నాయకులు శంకరానంద్‌రెడ్డి డిమాండ్ చేసారు. పంచాయతీలో తీర్మానం బుక్ మాయంపై ప్రశ్నించారు. పంచాయతీలో టెండర్ లేకుండా ట్రాక్టర్‌ను ఏలా పెట్టారని, ప్రజలకు అందించే శుద్ధి చేసిన నీటి ధరను ఎందుకు పెంచారని... ఆ వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్ఞ, విఆర్వో రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మురగారెడ్డి, టిడిపి, జనసేన, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఆధారం "గ్రామసభ"
### సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి

**చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కారానికి ఆధారం గ్రామసభ అని చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధిపై చర్చించడానికి గ్రామసభ సరైన వేధిక అన్నారు. గ్రామానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకునేందుకు, పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు గ్రామసభ ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రమంలో చిరువ్యాపారులు వారపు సంతలో గుత్తేదారు అధిక మొత్తం చెల్లించాలని బలవంతంగా వసూలు చేసినట్లు ఫిర్యాదు చేశారు. తమ వద్ద రూ.150/-లు తీసుకున్నారని కొందరు, రూ.100/-లు తీసుకున్నారని మరికొందరు ఫిర్యాదు చేశారు. మరోమారు ఈ విధంగా తమపై దౌర్జన్యం చేస్తే పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని అన్నారు. దీనిపై సర్పంచ్‌తో పాటు ఈఓ మహేశ్వరయ్య స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో వసూలు చేస్తే టెండరు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, వార్డు సభ్యుడు కొత్తపాటి కోటిరెడ్డి, ఏపిఓ జ్యోతి, మాజీ జడ్పీటిసి అమ్ములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీ అమ్మవారి దసరా ఉత్సవాలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త** పట్టణంలోని బజారువీధి, ఉప్పువీధిలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం నుంచి కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. అనంతరం గణపతి పూజ, స్వస్తివాచనం నిర్వహించారు. బజారు వీధిలోని ఆలయంలో కమిటీ అధ్యక్షులు జూలుగంటి మురళీకృష్ణ సాధర్యంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం సంప్రదాయ బద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉభయదారులు పొట్టి భాస్కర్ గుప్తా, తదితరులు వెంటరాగా సభ్యులతో కలసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉప్పువీధిలోని ఆలయంలో ఉభయదారులు అమ్మవారికి సాంగ్యం తీసుకువచ్చారు. అయితా సాయిబాబా, అయితా చిరంజీవి అయితా శ్రీనివాసులు కుటుంబసభ్యులు అమ్మవారి పూజలకు శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలను తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ శిఖరంపై జెండాను ఆవిష్కరించారు. తొలిరోజు ఉప్పువీధిలోని అమ్మవారు బాలవావీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రెండు ఆలయాల్లో వాసవీ ఆర్యవైశ్య సమాజం కమిటీ,మహిళా, యువజనసేవా సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన వారికి ఉచితంగా ప్రసాదాలను పంపిణీచేశారు.

## పైప్‌లైన్ మరమ్మతుకు అడ్డుకట్ట: రోడ్డుపై నీళ్ళు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మున్సిపల్ సిబ్బంది తీరు పలువురిని ఇబ్బంది కల్గిస్తుంది. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని పిచ్చాటూరు రోడ్డులో ని విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పైప్ లైన్ లీకేజీ ఉందని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది దానినిబాగు చేయటానికి మురుగునీటి కాలువకు మట్టితో అడ్డుకట్ట వేసారు.దాంతో మురుగునీరు చక్కటి తారు రోడ్డుపై పారుతూ రోడ్డు పక్కన రాకపోకలకు ఇబ్బందిగా మారింది.పైప్‌లైన్ మరమ్మత్తులు లీకేజీలు బాగు చేయటం మంచిదే కానీ దానికి రూ.60లక్షలతో పనులు చేసారు.కానీ మున్సిపల్ సిబంది తీరుతో రోడ్డు పక్కన మురుగు నీరు నిలిచి అస్తవ్యస్తంగా మారింది. పాదచారులు,ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## మాజీ చైర్మెన్ సారధ్యంలో అన్నదానాలు: సామాజిక కార్యక్రమాలు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో గురువారం అన్నదానాలు,సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిధిగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి హాజరయ్యారు. ఆయన జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, టైలర్స్ అసోసియేషన్ నాయకులు సారధ్యంలో భారీ ఎత్తున కేక్ ఏర్పాటు చేసి పంచిపెట్టారు. వైయస్ఆర్ విగ్రహం వద్ద ఎటియస్‌యూత్ సారధ్యంలో అన్నదానం ఏర్పాటుచేసారు.ఈ కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి,అంజూరు తారక శ్రీనివాసులు కలిసి పేదలకు పంపిణి చేసారు. వైయస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు,బ్రెడ్‌ను పంపిణి చేసారు. కాగా తొట్టంబేడు మండలం శివనాధపాళెంలోని అమ్మ అశ్రమంలో వృద్ద మహిళలకు చీరలను పంపిణి చేసారు.వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి డివిజన్‌లో 30 మద్యం దుకాణాలకు అనుమతి



**తొట్టంబేడు, అక్టోబర్ 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి డివిజన్‌లో 30 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎక్సైజ్‌శాఖ సిఐ లావణ్య ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎక్సైజ్‌సూపర్‌వైజర్ వాసుదేవచౌదరిలు తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో 12 దుకాణాలకు గాను రూ.65లక్షలు డిపాజిట్, బుచ్చినాయుడుకండ్రిగలో ఐదు దుకాణాలకు గాను రూ.55లక్షలు డిపాజిట్టు కెవిబిపురం మండలంలో మూడు దుకాణాలకు రూ.55లక్షలు డిపాజిట్, తొట్టంబేడు మండలంలో మూడు దుకాణాలకు రూ.55లక్షలు డిపాజిట్టు, ఏర్పేడులో రూ.65లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు వారివారి పరిధిలోనఇ ఎక్సైజ్‌స్టేషన్‌లో దరఖాస్తులు స్వీరింపబడుతాయన్నారు. ఈడివిజన్‌లో మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉన్నారని మద్యం దుకాణాలకు దరఖాస్తు దాఖలు చేసే వారు ఈకౌంటర్ల్లో చేయాలన్నారు. 11వ తేదీ నుంచి తిరుపతిలోని శిల్పారామం నందు లక్కీ డిప్ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించబడు తాయన్నారు. అప్లికేషన్ వేసేవారు రూ.2లక్షలు రుసుము చెల్లించాల్సి ఉంటుందనితిరిగిఇవ్వబడదనిస్పష్టంచేశారు.ఆన్‌లైన్ ద్వారా అయినా దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు.

## దక్షిణకాళికామాత ఆలయంలో ప్రారంభమైన దసరా సంబరాలు

**.శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 3 ప్రభాతవార్త** మండలంలోని



వేడాం గ్రామంలోని కైలాసగిరి పర్వతపంక్తుల్లో వెలసిన దక్షిణకాళికామాత అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి దసరా సంబరాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారికి విశేష అభిషేకాలు,అలంకరణ చేపట్టి స్వర్ణకవచాలంకృత ఆనందభైవరిదేవిగా కన్నులుమిరుమిట్లు గొలిపేటట్లు అలంకరించారు. పలువురు భక్తులు ఎర్రవస్త్రాలు ధరించి భవానీమాల ధరించారు. జైభవానీ అంటూ నామస్మరణ మారుమ్రోగింది. ఆలయ ఛైర్మన్ నాటు వరదారెడ్డి, కార్యదర్శి వెంకటేష్, వైస్ ఛైర్మన్ చంద్రారెడ్డి, ఉప కార్యదర్శి కె.షణ్ముగంరెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే తొలిరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో పలువురు భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామం నుంచే కాకుండా శ్రీకాళహస్తి పట్టణం, చెన్నై ప్రాంతాల నుంచి పలువురు భక్తులు విచ్చేశారు. తొలిరోజు ఉభయదారులుగా కొండా శ్రీనివాసప్రసాద్, విజయరాణి, హర్షిష్‌క్రిషన్, విఆర్.మధురఫుడ్ ప్యారడైస్, ఎస్.వెంక టసుబ్బా రెడ్డి, రమణమ్మల కుమార్తెలు వసుధ, వళ్ళీశ్వరి, మోనిక, దప్పిలమ్మ, నిర్మాణ కర్త, సాయివసుధ ట్రస్టు ఛైర్మన్ బద్వేల్‌లు హజరయ్యారు. ఇక నేడు గాయత్రీదేవి అలంకరణ, 5న అన్నపూర్ణాదేవి అలంకరణ, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ, 7న బాలత్రిపుర సుందరీదేవి అలంకరణ, 8న శ్రీమహాలక్ష్మిదేవిఅలంకరణ, 9నశ్రీసరస్వతీదేవి (మూలానక్షత్రం)అలంకరణ, 10న శ్రీవనదుర్గాదేవి అలంకరణ, 11న మహిషాసురమర్ధినిదేవి అలంకరణ, 12న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇక ఆలయ ఆవరణలో మహిళా భక్తులు పలువురు నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులుతీర్చుకున్నారు.

## బుచ్చినాయుడు పల్లి బావిలో యువకుడి మృతదేహం

**చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



బుచ్చినాయుడు పల్లి పంచాయతీ సమీపంలోని వ్యవసాయ బావిలో గురువారం ఓ యువకుడి మృతదేహం పడివున్నట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. చంద్రగిరి భారతి నగర్‌కు చెందిన వరలక్ష్మి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు హేమంత్ (22) గా మృతుడిని పోలీసులు గుర్తించారు. యువకుడి మృతిపై కారణాలు తెలియరానప్పటికీ పోలీసులు అనుమానస్పద మృతిగా దర్యాప్తు చేపట్టారు. చిన్నవయస్సులో కన్నబిడ్డ కడతేరి పోవడంతో తల్లిదండ్రుల వేదన చూపరులను కలచివేసింది.

## డ్రిప్ పద్దతిలో సాగు అధిక దిగుబడికి సాధించు..!
### జిల్లా ఉద్యానవన అధికారి బి.దశరథరామిరెడ్డి

**చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



రైతులు లేత మామిడి తోటలలో కాయగూరలు, పూలతోటలను డ్రిప్ పద్దతిలో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి బి.దశరథరామిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం భీమవరం, పాకాల మండలం వల్లివేడు గ్రామాలలో గురువారం ఆయన ఈ పంట ద్వారా నమోదు చేసిన ఉద్యానవన పంటలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కాయగూరలు సాగుకు ఉద్యానవన శాఖ ఎకరాకు రూ.8000/-లు, పూలతోటల సాగుకు రూ.6,400/-లు, బొప్పాయి సాగుకు రెండు సంవత్సరాలకు రూ.24,662/-లు రాయితీలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చంద్రగిరికి 7, సర్కిల్‌కు 17 మద్యం షాపులు
### బడి, గుడికి దూరంగా మద్యం షాపులు, ఏఈఎస్ఓ వాసుదేవ చౌదరి

**చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



చంద్రగిరిలో 7 మద్యం షాపులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ఏఈఎస్ఓ వాసుదేవ చౌదరి తెలిపారు. నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన నేపధ్యంలో గురువారం ఆయన ఎక్సైజ్ కార్యాలయంలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాలో మొత్తం 227 మద్యం షాపులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. చంద్రగిరి సర్కిల్ పరిధిలో చంద్రగిరి 7, పాకాల 5, చిన్నగొట్టిగల్లు 3, ఎర్రావారిపాళ్యం 2 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. చంద్రగిరి మండలంలో రూ.45 లక్షలు, పాకాల రూ.55 లక్షలు, చిన్నగొట్టిగల్లు రూ.55 లక్షలు, ఎర్రావారిపాళ్యం రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. మద్యం షాపులను బడి, గుడికి దూరంగా ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందన్నారు. వీటికి సబంధించిన అప్లికేషన్లు అక్టోబర్ 1 నుండి 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడతాయన్నారు. అప్లికేషన్స్‌ను ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లోనూ స్వీకరించబడతాయన్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 12న తిరుపతి శిల్పారామంలో లాటరీ పద్దతిలో షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు. నియమ నిబంధనల కొరకు చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించగలరని అన్నారు. ఈ సమావేశంలో డిటిఎస్ఓ శ్యాంప్రసాద్, సిఐ ఫణీంద్ర, ఎస్ఐలు గిరి, సుధాకర్, పాల్గొన్నారు.

## జంతువధశాల వేలం వాయిదా
### సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి

**చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**

చంద్రగిరి గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించతలపెట్టిన జంతువధశాల బహిరంగ మరువేలంను వాయిదా వేసినట్లు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఈఓ మహేశ్వరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుపతి వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపధ్యంలో అధికారులు సిఎం రాకకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైనందున వేలంను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వేలంపై త్వరలోనే ప్రకటన చేయనున్నట్లు తెలిపారు.

## డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయ సాగు లాభదాయకం

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



రైతులు భూ పరిస్థితులు అనుకూలంగా మెట్ట భూముల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయ సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు తెలియజేశారు. బుచ్చినాయుడు కండ్రిగ రైతు సేవాకేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌నాయుడు అధ్యక్షతన ఆర్ఎస్‌కే కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గత ప్రభుత్వ ం డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, వ్యవసాయ యాత్రీకరణ పనిముట్లు పంపిణీ చేయకుండా చేసింది. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రైతులకు కావలసిన వ్యవసాయాత్రీకరణ పనిముట్లు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయానికి కావలసిన ఎరువులు, జిప్సం సరఫరా వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో చెరకు రైతులకు మయూర చెరకు ఫ్యాక్టరీ వారు చెల్లించవలసిన డబ్బులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. మయూర షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకునే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో అన్ని శాఖల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కొండా సురేఖను సస్పెండ్ చేయాలి
### అక్కినేని నాగార్జున అభిమాన సంఘం నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



తిరుపతి అనంతవీధి కూడలిలో ఓ కార్యాలయంలో తెలంగాణ ప్రజాప్రతినిధి కొండా సురేఖ పై విలేకరుల సమావేశంలో అక్కినేని కుటుంబం పై చేసిన వ్యాఖ్యలను తిరుపతి అక్కినేని నాగార్జున అభిమాన సంఘం నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున అభిమాన సంఘం నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎంతో జవాబుదారీతనంగా ఉండవల్సిన రాజకీయనాయకులు ఉన్నత కుటుంబాలపై నిరాధారోపణలను చేయడం సిగ్గుచేటు అని, కొండా సురేఖ ఒక మహిళా అయి ఉండి ఇంకొక మహిళా వ్యక్తిగత విషయాలను మీడియా ముఖంగా తప్పుడు ప్రచారం చేయడాన్ని అక్కినేని నాగార్జున అభిమాన సంఘం తరపున ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుండి ఆమెను సస్పెండ్ చేసి ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హురాలిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపినాథ్, వెంకట్, యలమూరి గిరి తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ అండదండలతో దాడి

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**




తిరుచానూరులో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో కూటమి నాయకులు దాడి చేస్తున్నారని తెలిపినా తిరుచానూరు పోలీసులు పట్టించుకోలేదని బాధితురాలు అనూష ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన చెల్లెలుతో కలిసి మాట్లాడారు. తమకు సంబంధించిన తిరుచానూరు బండ్లమిట్ట వీధిలో 60 అంకణాల ఇల్లు, షాపును కూటమి నేతలు దౌర్జన్యం చేసి కూల్చివేశారని బాధపడ్డారు. నాన్న లేని సమయం చూసి అమ్మాయిలు అని కూడా చూడకుండా నన్ను నా చెల్లలపై కర్రలతో దాడి చేసి షాపులలోని వస్తువులను దొంగిలించడం జరిగిందన్నారు. అంతేకాకుండా కూటమికి సంబంధించిన నాయకులు నడిరోడ్డు పై అడపిల్లలని చూడకుండా మాపై దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత పెద్ద సంఘటన జరుగుతున్న తిరుచానూరు పోలీస్ స్టేషన్ సిఐ సంబంధిత పోలీసులకు కూటమి నేతలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే, కరువయ్యారని తెలిపారు. చివరికి తిరుపతి జిల్లా ఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేసి తిరుచానూరు పిఎస్‌కు రెఫెర్ చేసినా ఏ పోలీసు అధికారి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికార పార్టీ అండదండలతో ఇంత దుర్మార్గానికి పాల్పడిన కూటమి నేతలు జయచంద్ర, రమేష్, ప్రసాద్, కాయల అంగడి లక్ష్మి దేవిల వల్ల తమకు ప్రాణ హాని వుందని వీరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పిజె చంద్రయ్య శెట్టి హఠాన్మరణం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు,ప్రముఖ ఆధ్యాత్మిక వాది ఆర్యవైశ్యప్రముఖులు పిజె చంద్రయ్యశెట్టి (74) హఠాన్మరణం చెందారు. బుధవారం ఇంటి వద్ద ఇంటిగోడ విషయంలో ప్రతివాదులతో ఘర్షణ పడ్డ ఆయనను పల్లవి ఆమె సొదరుడు శివకుమార్‌లు ఘర్షణ పడి తొసులాడుకున్నారని వారి చర్యలతో మానసిక వేదనకు గురైన తన భర్త అపస్మారక స్థితికి చేరుకున్నారని పి.భాగ్యలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసారు.కాగా గురువారం పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు,వారి సహచరులు స్కిట్ మాజీ చైర్మెన్ గురుదశరధన్, గోగినేని భాస్కర్‌నాయుడు,జానకి రాం, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా బిజెపి జిల్లా అధ్యక్షుడు బి.చంద్రప్ప హాజరై నివాళులర్పించారు.

# తిరుపతి డివిజన్

## ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం - లక్ష్మిపతిరెడ్డి

**రేణిగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



తన పంచాయతీ ప్రజల సంక్షేమానికి సర్పంచ్‌గా కాకుండా వేమారెడ్డి సంజీవయ్య వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్‌గా రాజకీయాలకు అతీతంగా ఎప్పుడు కట్టుబడి ఉంటానని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీలో కాపురం ఉంటున్న కొమరప్పగారి గుర్రప్ప కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నందు వల్ల లక్ష్మిపతిరెడ్డి తన సొంత ఖర్చులతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గిరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళిల ద్వారా పెన్షన్ డబ్బులను అందజేశారు. గ్రామ పంచాయతీలో జరిగే అభివృద్ధి విషయంలో పార్టీలకతీతంగా అధికారులంతా కలసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**పుత్తూరు, అక్టోబరు 3 ప్రభాతవార్త :**

గాంధి జయంతి రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మునస్వామి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ శాఖ సిఐ మురళీమోహన్ తెలిపారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి31క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## క్యాన్సర్ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం



**పుత్తూరు, అక్టోబరు 3 ప్రభాతవార్త :** నందిమంగళంలో కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న మోక్షిత అనే అయిదేళ్ల పాపకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు గురువారం రూ. 10,000 వేలు ఆర్థిక సాయం అందించారు. చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో పాప చికిత్స పొందుతున్నందున ఆమె తల్లి ప్రియకు ఎంబి రోడ్డులోని తన కార్యాలయంలో నగదు అందించారు. కార్యక్రమంలో పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, నాయకులు రవినాయుడు, ధనపాల్, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఇంజనీర్‌గా ఇబ్రహీంఖాన్ బాధ్యతల స్వీకరణ

**సత్యవేడు, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



సత్యవేడు మండల పరిషత్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఇబ్రహీంఖాన్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ సమక్షంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఇబ్రహీంఖాన్ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పంచాయతీరాజ్ ఏఈగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే మండల పరిషత్ ఏఈగా ఇబ్రహీంఖాన్ బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టు గత 8 ఏళ్లుగా భర్తీకి నోచుకోలేదు. ఎట్టకేలకు ఈ పోస్టులో ఇబ్రహీంఖాన్ నియమించారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**పుత్తూరురూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని పలు ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైంది. రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో మానసాదేవి అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి అలంకరణ, శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి ఆలయంలో శ్రీ ద్రౌపదీదేవి ఆదిపరాశక్తి జగన్మాత అలంకరణ, శ్రీ కామాక్షి సమేత సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షిదేవి, కామాక్షిదేవి అలంకరణ, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరణ ఆలయంలో ఉత్సవ విగ్రానికి దీక్షాబంధన అలంకరణ మూలవర్లకు పసుపు అలంకరణ, దుర్గమ్మ కొండ రాచపాళెం(ఈశ్వరాపురం)లో వెలసిన శ్రీ లక్ష్మీ కనకదుర్గమ్మ స్వర్ణ కవచదేవి అలంకరణ, ఓం శక్తి ఆలయంలో ఓంశక్తి అమ్మవారు ప్రత్యేక అలంకరణతో దర్శనభాగ్యాన్ని కల్పించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణతో అలంకరించారు.

## తూతూ మంత్రంగా గ్రామసభ

**కేవీబీ పురం, అక్టోబరు 3 ప్రభాతవార్త:**

కేవీబీపురం మండలం శ్రీనివాసపురం గ్రామంలో గురువారం తూతూ మంత్రంగా గ్రామసభ నిర్వహించారని తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పంచాయతీలోను కూటమి నాయకులను గ్రామసభలో తప్పక ఆహ్వానించాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా శ్రీనివాసపురం సచివాలయంలో మాత్రం ప్రభుత్వం మారినా ఇక్కడ పని చేస్తున్న అధికారులు జగన్ జపం చేస్తున్నారని మండి పడ్డారు. గ్రామసభ 2 గంటలకు నిర్వహిస్తామని చెప్పి ఉదయం 10గంటలకుగుట్టుచప్పుడుకాకుండానిర్వహించారన్నారు. దీనిపై ఎంపీడీవో సమాధానం చెప్పాలని ఆయన కోరారు.

## ఎంపీడీవో, ఏవోలకు సన్మానం

**వడమాలపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



మండలంలో పనిచేసి బదిలైన ఎంపీడీవో కార్యాలయం అధికారులకు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాను మూర్తి, ఏవోశేఖర్, జూనియర్ అసిస్టెంట్ దొరస్వామిలను శాలువలు, పూలమాల లతో సన్మానించారు. జడ్పీటీసీమురళీధర్‌రెడ్డి,ఎంపీపీవిజయలక్ష్మి,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**వడమాలపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త:** స్థానిక కన్యకాపరమేవ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం నవరాత్రి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పురోహితులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. వేద మంత్రాలతో కలశస్థాపన చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చాన, కుంకుమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని బాలా త్రిపుర సుందరిదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే స్థానిక అంకాళపరమేశ్వరి ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారికి అభిషేకం చేసి వెండీ కవచాన్ని తొడిగి పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

**వడమాలపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త:**

పూడి-రేణిగుంట రైల్వేమార్గంలో గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. గురువారం స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుమారు 35 సంవత్సరాలు వయసు ఉన్న మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ఆకు పచ్చ కలర్, ఆరెంజ్ కలర్ సిల్క్ చీర ధరించి ఉన్నట్లు, ఆత్మహత్యకు ప్రయత్నించగా తీవ్ర గాయాలతో రైలు కట్ట వద్ద అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రేణిగుంట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## టీడీపీ సీనియర్ నాయకుడి మృతికి నివాళి

**విజయపురం, అక్టోబరు 3 ప్రభాతవార్త:**

మండలంలోని మహారాజపురం దళితవాడలో టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు లోకేష్‌రాజు, వెంకటేశులయాదవ్, కాటయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఎస్ఐని సన్మానించిన మండల టీడీపీ నాయకులు

**విజయపురం, అక్టోబరు 3 ప్రభాతవార్త:**



మండలంలో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బలరా మయ్యను మండల టీడీపీ నాయకులు గురువారం విజయపురంలో శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు,ప్రధానకార్యదర్శిబాబుయాదవ్, టీఎన్ఎఫ్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, నాయకులు హరికృష్ణ, నారాయణరాజు, చెంచయ్య, శివలింగం పాల్గొన్నారు.

## 7వతేదీ నుంచి బస్‌పాస్‌లు

**తొట్టంబేడు, అక్టోబర్ 3 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణీకులకు మరియు విద్యార్థులకు ఏపిఎస్‌ఆర్టీసి బస్‌పాసు (విద్యార్థులు మరియు అన్ని రకాలపాస్‌లు) వైబ్‌సైట్ ఈనెల 5 నుంచి 6వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ చేయుకారణంగా బస్‌పాసుల జారీ నిలిపివేయడం జరుగుతుందని దీన్ని ప్రయాణీకులు, విద్యార్థులు గుర్తించాలన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి బస్‌పాస్ కౌంటర్ల నందు యధావిధిగా ఇవ్వబడుతుందన్నారు.

## ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**తొట్టంబేడు, అక్టోబర్ 3 ప్రభాతవార్త**

మండలంలోని పెన్నలపాడు ఇసుకరీచ్‌నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహశీల్దార్ యు.మధుసూధనరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెన్నలపాడు ఇసుకరీచ్‌లో అక్రమంగా తరలిస్తున్నారన్న గ్రామస్తుల పిర్యాదుతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆరు ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు వివరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. ఆకస్మిక తనిఖీల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభం



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
భక్తులపాలిట వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమవుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు తోలిఘట్టంగా గురువారం రాత్రి వసంతమండపంలో అంకురార్పణ జరిగింది. శుక్రవారం నేటి రాత్రి పెద్దశేషవాహనంతో వాహనసేవలు మొదలుకానున్నాయి.తొమ్మిదిరోజులుపాటు జరిగే వివిధ రకాల వాహన సేవల వీక్షణకు దేశం నలుమూలల నుండే వచ్చే భక్తులను ఆకట్టుకునేలా తిరుమలలో పుష్ప,ఫల, విద్యుద్దీపాలంకరణలు చేశారు. స్వామివారి సేవలో మేమూ తరిస్తామంటూ ఆనందంతో ఉప్పొంగుతున్నాయి. ఒకరేమిటి సకలదేవతలు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించి దేవదేవుని దర్శించుకుంటారని పురాణాల కథనం. ఆ వేంకటేశ్వరునిసేవలో తరించిన గజ,అశ్వ,వృషభ వాహనాలు, సువాసనల పుష్పాలు, ఫలాలు ఇవన్నీ ప్రత్యేకంగా అలంకరణలో భాగస్వామ్యం అయ్యాయి. ఆలయం పరిసరాలు ఇనుపకంచెలతో నింపేశారు. భక్తులు గ్యాలరీల్లోనే ఉండి వాహనసేవలు వీక్షించేలా చూస్తారు.







## బ్రహ్మోత్సవాల్లో నేడు

(04.10.2024 )

**"ధ్వజారోహణం":**





శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సకలదేవతామూర్తులను ఆహ్వానిస్తూ స్వామివాహనమైన గరుడుని చిత్రాన్ని కొత్తవస్త్రంమీద చిత్రీకరించి దీన్ని"గరుధధ్వజపటం" అంటారు.

**-"పెద్దశేషవాహనం": (రాత్రి 9గంటలు)**

తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజురాత్రి మొదటివాహనంగా పెద్దశేషవాహనం మొదలవుతుంది. రాత్రి 9గంటలకు వాహనమండపం నుండి బయలుదేరే ఈ వాహనసేవలో శ్రీమలయప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలసి ఊరేగుతారు.

## సరస్వతీ దేవి అలంకారంలో మరగదాంభిగా దేవి

కాణిపాకం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో గురువారం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు మరగదాంభిగా అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొకు ్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. తిరిగి రాత్రి అలంకరించిన అమ్మవారిని ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా వనమహోత్సవం



కాణిపాకం,అక్టోబర్ 3 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో గురువారం వనమహోత్సవం కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈకార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం పరిసర ప్రాంతాలు,డార్మెంటరీ హాలు ముందు ఖాళీ ప్రదేశంలో స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్‌ల ఆధ్వర్యంలో మొక్కలు(దేవతా వృక్షాలు)నాటే కార్యక్రమంను నిర్వహించారు.ఈకార్యమ్రంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక నాయకులు,ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు శాస్త్రోకంగా అంకురార్పణ

తిరుపతిరూరల్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఆలయంలో జరిగిన అంకుర్పాణలో భాగంగా తెల్లవారుఝామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి, కొలువు, పంచాంగ శ్రవణం, మూల వర్లకు అభిషేకం నిర్వహించారు. నవరాత్రి బ్రహ్మోత్స వాలు విజయవంతం కావాలని జరిగిన అంకురార్పణ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పర్యవేక్షణ చేయడానికి శ్రీవారి సర్వ సైనాధిపతి విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై గ్రామంలో ఊరేగారు.

**నేడు ధ్వజారోహణం**

ధ్వజారోహణంతో శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6గంటల నుండి 7గంటల మధ్య కన్యాలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయబద్దంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత రాత్రి 7గంటల నుండి 9 వరకు పెద్ద శేష వాహనం జరుగుతుంది.

## ఆలయాల్లో నవరాత్రుల శోభ

## -దివ్యాలంకారాల్లో అమ్మవార్ల దర్శనం

శ్రీకాళహస్తి అక్టోబర్ 3 ప్రభాతవార్త





శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఉన్న అమ్మవారి ఆలయాల్లో సందడి చోటుచేసుకుంది. నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కావటంతో ఆలయాలు మహిళా భక్తులతో కిట కిట లాడాయి. ఈ మేరకు ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ పలుమార్లు అనుబంధ ఆలయాల్లో పర్యటించి ఉత్సవాలను వైభవంగా కన్నులు కట్టినట్లు నిర్వహించాలని నిర్ణయించారు. ఇక పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో దసరా శోభాయమానంగా ఏర్పాటు చేశారు. ఉదయం బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణంలో ఊరేగింపు జరిపారు. అమ్మవారికి సారెను అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ అనుబంధ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కాగా ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై వెలసి దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వేకువ జామునుంచే ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయం నుంచి కలశాన్ని ఆలయాధికారులు తీసుకొని కొండపైకి వెళ్ళారు.ఉభయదారులు వెంటరాగా అమ్మవారికి అభిషేకాలు జరిపారు. కలశాలతో పాటు ఆలయం తరపున ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ సుగంధద్రవ్యాలు అందించగా ఉభయదారులు కాసరం బాలాజి పాల్గొన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు భాగంగా భాస్కరపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బజారువీధిలోని శ్రీ కన్యకారపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో చైర్మెన్ జూలుగంటి మురళీకృష్ణ,ఉప్పువీది ఆలయంలో అధ్యక్షులు వడ్లపూడిమధుసూధనరెడ్డి సారధ్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గ్రామోత్సవంలో ఉభయదారులు పొట్టి భాస్కర్‌లు వెంటరాగా సంఘ ప్రముకులు జూలుగంటి రాజేష్, ఉపాధ్యక్షుడు మోహన్, గౌరవాధ్యక్షుడు సురేంద్ర,బాలాజి, సత్య,మధు,ఊటుకూరు రమేష్,రాజశేఖర్ నాగరాజు,కె.హరితదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి దేవి అలంకారంలో ముత్యాలమ్మ

చిల్లకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త



మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవి శరన్న వరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమై య్యాయి. ఉదయం మూలమూర్తులకు అభిషేకాలు గణపతి పూజ, చండీ పారాయణం , చండీ హోమం, సాయంత్రం సహస్రనామార్చన మూల మూర్తి నిజపాద దర్శనం నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో సింహవాహనంపై కొలువుదిరి భక్తులకు దర్శన మిచ్చారు. అనంతరం మాడా వీధుల్లో ఘనంగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనా రెడ్డి, ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, దువ్వూరు సాయి కృష్ణారెడ్డి, చేవూరు శ్రీనివాసులు, బాలు, బాలాజీ, ఉప్పల ప్రభాకర్, ఎల్లసిరి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవికి విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ సారె సమర్పణ

కుప్పం, అక్టోబర్ 3 ప్రభాతవార్త



కుప్పం ముత్తుమారెమ్మ గుడి వీధిలో దసరా శరన్నరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఇక్కడ ప్రతిష్టించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారికి విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయం నుంచి తెచ్చి సారె, పసుపుకుంకుమలను ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దంపతులు అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. కార్యక్రమాల్లో ఏపిఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, కమీషనర్ శ్రీనివాసరావు, నేతలు కన్నన్, వెంకటరమణబాబు, ప్రమోద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కాగా కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మ, శ్రీ పెద్దపల్లి గంగమ్మ, శ్రీ కన్యకాపరమేశ్వరి, శ్రీ గంగమ్మ ఆలయాలతో పాటు కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలను ప్రారంభించారు.

## చందల అలంకరణతో ముత్యాలమ్మ

బంగారుపాళ్యం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారుపాళ్యంలో వెలసిన గ్రామ దేవత గురువారం రాత్రి చందన అలంకర ణతో భక్తులకు దర్శనమిచ్చింది. అంతకు ముందు ఆలయ అర్చకులు మురళీ స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ లు నిర్వహించారు. ఆలయంను వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చందన అలంకరణ కు ఉభయదారులుగా శాంతినగర్‌కు చెందిన జగదీష్, దాము, తగ్గువారిపల్లికి చెందిన మురుగేష్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు.

## ఎక్కడ నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి

### దోమల లార్వాలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోండి : కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, అక్టోబరు 3 ప్రభాతవార్త:
వర్షాలకు నగరంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా అయిల్ బాల్స్ వేయ డం వంటి చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం అక్కారంపల్లి, కొర్లగుంట, తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను పరిశీలించి ఆయిల్ బాల్స్ వేయించే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడ నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెద్ద డ్రైనేజీ కాలువల్లో చెత్త తొలగించడం వలన వర్షపునీరు కొంతమేర సజావుగా వెళ్తున్నాయని అన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి వస్తున్నాయని అన్నారు. అవి కూడా రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, హెల్త్ అధికారులు కలసి చర్యలు చేపట్టాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, డిఈ రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి

రేణిగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త:



దేశి శరన్నవరాత్రుల్లో భాగంగా తొలిరోజు గురువారం రేణిగుంట మండలం కరకంబాడిలో భక్తులకు కల్ప తరువుగా విరాజిల్లుతున్న శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి చాలా త్రిపుర సుందరిగా ప్రత్యేక అలంకరణతో భక్తులకు కన్నుల పండువ చేస్తూ దర్శనమిచ్చారు. ఆలయ శాశ్వత ధర్మకర్త కుర్రకాలవ వాసు అమ్మవారికి పూజారుల చేత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ మాత దేవస్థానంలో అమ్మవారిని 9 రోజులు ఏఏ రూపాలతో అలంకరిస్తారు. అదే మాదిరి శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ధర్మకర్త వాసు తెలియజేశారు. భక్తులు 9 రోజులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## డ్రోన్ల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు.. చెత్త గుర్తింపు

### మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, అక్టోబర్ 3 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలో డ్రోన్ల పర్యవేక్షణ ద్వారా చెత్తను గుర్తించి పారిశుద్ధ్య పనులు చేపడ్తామని మున్సిపల్ కమీషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్‌కుప్పంగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. దాదాపు 75మంది కార్మికులతో పట్టణంలో పగలు, రాత్రి రెండుపూటల పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి రాజు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాల తొలగింపు కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. ఇక మున్సిపల్ పరిధిలో రోజూ డ్రోన్ల ద్వారా చెత్త సేకరణ, చెత్తను గుర్తించి అప్పటికప్పుడు కార్మికులను పంపి చెత్తను తొలగించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, సెల్వరాజ్, సురేష్, జాకీర్, వేలు తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు సంఘటనలో ముగ్గురికి కత్తిపోట్లు

గూడూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని బుధవారం రాత్రి ప్రారంభమైన జెండా ఉత్సవాల్లో గురువారం వేకువన రెండు వేరువేరు సంఘటనలో ముగ్గురు యువకులు కత్తి పోట్లుకు గురై గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు స్థానిక చిన్నమసీదు వీధికి చెందిన హరీష్ అనే యువకుడు గత కొంతకాలం నుంచి తిరుమలలో నివాసముంటూ డ్రైవర్‌గా జీవితం సాగిస్తున్నాడు. జెండా ఉత్సవాలను తిలకించేందుకు స్థానిక చిన్న మసీదు వీధిలో ఉంటున్న బంధువులు యశ్వంత్ ఇంటికి వచ్చాడు. యశ్వంత్‌తో కలిసి జెండాలను తిలకిస్తున్నాడు. కొందరు యువకులు గొడవపడుతూ యశ్వంత్, హరీష్‌లపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన యశ్వంత్, హరీష్‌లను స్థానిక ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అదే విధంగా స్థానిక కృష్ణమందిరం వీధికి చెందిన అరెహమాన్ అనే యువకుడు అతని స్నేహితుడు భాస్కర్‌తో కలిసి జెండా ఉత్సవాల్లో శివాలయం వద్ద ఉన్నారు. పట్టణానికి చెందిన ఇమ్మానియేలు అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. భాస్కర్‌కు, ఇమ్మానియేలుకు పాత గొడవలు ఉండడంతో వారిద్దరు గొడవపడ్డారు. దీంతో వీరిని అడ్డం తీసేందుకు అబ్దుల్ రెహమాన్ వెళ్లగా ఇమ్మానియేలు తొసివేయడంతో అబ్దుల్ రెహమాన్ కిందపడ్డారు. ఇంతలో పక్కనే ఉన్న ఇమ్మానియేలు స్నేహితుడు పట్టణానికి చెందిన శ్రీనాథ్ అనే యువకుడు కత్తితో రెహమాన్‌ను పొడిచి గాయపరిచాడు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ శేఖర్ బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీశక్తి పీఠంలో దేవినవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

రామచంద్రాపురం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో గురువారం భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్దేశ్వర నంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో పీఠాదేశ్వరి రమ్యా నందభారతి అమ్మవారికి వివిధ సుగంధ భరిత పరిమళ ద్రవ్యా లతో అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

### ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి

గూడూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త



మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 9వ తేది సాయంత్రం 5 గంటలు లోపల దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని జానకిరాంపేట ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ గూడూరు పురపాలక పరిధిలో 12 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పురపాలక పరిధిలో షాపులు ఎక్కడైనా ఏర్పాటు చేసుకునేందుకు ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మద్యం షాపులు విక్రయాలు జరుపుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 11వ తేది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఎక్సైజ్ కార్యాలయంలో గాని ఆన్‌లైన్ ద్వారా గాని రెండు లక్షల రూపాయిలు డిపాజిట్ చేయాలని వారు తెలిపారు. ఈ డిపాజిట్ షాపులు రానటువంటి వ్యక్తులకి తిరిగి ఇవ్వడం జరగదని వారు తెలిపారు. ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని షాపులైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఊహ శ్రీ, సిఐ కరీమా బేగం, స్క్వాడ్ సిఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖాధికారి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖాధికారి డి. అరుణ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను గురువారం ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## గదుల రిజర్వేషన్‌కు బయోమెట్రిక్ విధానం: ఇఓ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ మరో అడుగు ముందుకు వేసారు.గతంలో జ్ఞాన ప్రసూనాంబ అతిధి గృహంను కొందరు అధికారులు,ప్రభుత్వ అధికారులు తమ సొంత జాగీరులా వాడుకున్నారు. దేవస్థానం ఆదాయాలకు గండి కొట్టారు. ప్రస్తుతం వసతి గదుల బుకింగ్‌కు విధి విధానాలు రూపొందించారు. ఇక మీద బయో మెట్రిక్ విధానాన్ని అమలుకు ఆదేశించారు. గదులు కావాల్సిన వారు సిఆర్ఓ కార్యాలయం లేదా వసతి గృహాల వద్దనే బయో మెట్రిక్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని ఇఓ ప్రకటించారు. ఆధార్‌కార్డు, లేదా ఏదేనీ గుర్తింపు కార్డు చూపి గదులు బుక్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

## తిరుపతి కాట్పాడి డబుల్ లైన్ కొరకు ఎన్నాళ్ళు ఈ నిరీక్షణ

పాకాల, అక్టోబర్ 3, ప్రభాతవార్త



తిరుపతి నుంచి కాట్పాడి వరకు పాకాల రైల్వే జంక్షన్ నందు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ఊపిరిపోసుకోనున్న రైల్వే టర్మినల్ ప్రాజెక్ట్ న్యూ డిపో పాకాలకు మంజూరైనందున తిరుపతి నుంచి కాట్పాడి వరకు పాకాల నుంచి ధర్మవరం వరకు డబల్ నైన్ పనులు తక్షణమే చేపట్టవల్సిందిగా ప్రయాణికులు పెద్ద ఎత్తున కోరుతున్నారు. తిరుపతి కాట్పాడి మార్గంలో సింగల్ లైన్ కారణంగా రైళ్ల రద్దీ ఉన్నందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్య ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండటం వలన ప్రయాణికులు వారి గమ్యస్థానాలకి సకాలంలో చేరుకోలేని పరిస్థితి నెలకొని వుంది. పెరిగే రైల్ ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని చిత్తూరు ఎంపి దగ్గుమల్ల ప్రసాద్ రావు స్పందించి రైల్వే బోర్డు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి ట్రాక్ డబ్లింగ్ పనులు, పాకాలలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, త్వరితగతిన పూర్తి అయ్యేలా ప్రయత్నించాలని ఏపి నారాయణశక్తి, మచ్చా దొరస్వామి నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు, ప్రయాణికులు కోరుతున్నారు.

## వైద్య విద్యార్థులకు స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తిరుపతి హెల్త్, అక్టోబర్ 3, ప్రభాతవార్త
ఎస్వి వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల కొరకు ఘనంగా ప్రారంభించిన స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసినా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కమిషన్ వారి ఆదేశాల మేరకు క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్వి వైద్య కళాశాల క్రీడా పోటీల్లో వైద్య రంగంలో ఎంతో ఘన చరిత్ర సాధించుకుంది. ఈ మూడు రోజుల స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలలు పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల మొదటి రోజు క్రికెట్ ఆటను ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ఎస్వి వైద్య కళాశాల క్రీడా మైదానంలో వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో, అగ్రికల్చర్ కాలేజ్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ క్రికెట్ క్రీడల్లో దాదాపు 15 వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలలు దాదాపు 300 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొంటున్నారు. వీరికి వసతి ఏర్పాట్లు అన్నీ కూడా ఎస్వీ వైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ వసతి గృహంలో కల్పించడం జరుగుతుందన్నారు. వైద్య విద్య రంగంలో కూడా మెరుగైన ఫలితాలు, మనము చూస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవి ప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్ధసారధి రెడ్డి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ ఫహీమ్, డాక్టర్ త్రిమూర్తులు, డాక్టర్ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం, ఫిజికల్ డైరెక్టర్ శరవనన్, భాను ప్రకాష్, పీజీ వైద్య విద్యార్థులు, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.